క్లుప్తంగా

ఆకు తోటలలో వేరుకుళ్లును నివారించండి



రైతులకు సలహాలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఓబులవారిపల్లి: ఆకు తోటలో వేరుకుళ్ల తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారిణి మల్లిక పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా చిన్నఓరంపాడు గ్రామంలో తమలపాకు తోటలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఆకు తోటల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి జీవామృతం పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మధు, నవీన్, పుల్లయ్య, గంగాధర్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై పోరాడండి



అధినేతతో మాట్లాడుతున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్: ప్రజల పక్షాన ఉండి వారి సమస్యలపై పోరాడాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని వైఎస్సార్‌సీపీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తెలిపారు. మంగళవారం జగన్‌మోహన్‌రెడ్డిని వారు కలిసి పార్టీ బలోపేతం గురించి వివరించారు. పలు సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తాం

– సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణ

గాలివీడు: మృతుడు వెంకటరమణ కుటుంబానికి న్యాయం చేస్తామని సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మృతుడి కుటుంబ సభ్యులు ఎస్ఐను మంగళవారం కలిసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన సీఐ, ఎస్‌లు మాట్లాడుతూ నిందితులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, దోషులను చట్టం ముందు ఉంచుతామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ సబ్సిడీతో పీఎం సూర్య ఘర్ యోజన

రాయచోటి అర్బన్: ప్రభుత్వ సబ్సిడీతో ఎస్సీ, ఎస్టీ గృహాల ఇంటి పైకప్పుమీద సోలార్ రూఫ్ టాప్‌ను నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం ప్రారంభించిందని అన్నమయ్య జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ యస్.రమణ అన్నారు. మంగళవారం స్థానిక సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఆయన విద్యుత్ శాఖ, నెడ్‌క్యాప్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకం ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. పథకం కింద కేంద్ర ప్రభుత్వం రాయితీని అందిస్తుందన్నారు. జనవరి 10వ తేదీ లోపు వినియోగదారులు www.pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



పాదరక్షలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

సుండుపల్లె: మండలంలోని రాయవరం పీహెచ్‌సీలో కుష్టు వ్యాధిపై రోగులకు డాక్టర్ శేఖర్ రెడ్డి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్పర్శ, మచ్చలు శరీరంపై ఉన్నట్లయితే సమీప ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా చికిత్స చేసి మందులు అందజేస్తారని తెలిపారు. రాయవరం, పింఛా, చెరకువాండ్లపల్లి గ్రామాల్లో పాత కుష్టువ్యాధి రోగులకు పాదరక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరనారాయణ, ఎల్లమ్మ, నాగభూషణమ్మ, సుభాషిణి, సౌజన్య పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

– మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం: జిల్లాలో శాశ్వత భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చిన్నమండెం మండలం దేవళంపేట గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రెవెన్యూ సదస్సులలో ప్రధానంగా భూ ఆక్రమణలు, 22ఏ భూముల అక్రమాలతో పాటు పలు రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఆన్‌లైన్ చేయడంతో పాటు నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం మంత్రి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, మండల ప్రత్యేకాధికారి చంద్రానాయక్, తహసీల్దార్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు జననం.. మానవాళికి శుభకరం

- పట్టణాల్లో కాంతులీనుతున్న చర్చిలు
- క్రిస్మస్‌ను స్వాగతిస్తూ యువత, చిన్నారుల నృత్యాలు



రాజంపేట టౌన్: విద్యుద్దీపాల వెలుగులో బేతేలు చర్చి

రాజంపేట టౌన్: క్రీస్తు జన్మ వృత్తాంతానికి చిహ్నంగా జరుపుకొనే క్రిస్మస్ రానే వచ్చింది. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి నుంచి క్రైస్తవులు, విశ్వాసులు, పాస్టర్లు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యువతీ, యువకులు, చిన్నారులు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ క్రీస్తు జనన ఆవశ్యకత తెలిపారు. చర్చిలకు వెళ్లలేనివారు తమ ఇళ్లల్లోనే ప్రార్థనలు చేశారు. అర్ధరాత్రి 12 గంటలు కాగానే కేక్ కట్ చేసి హ్యాపీ క్రిస్మస్, మెర్రీ క్రిస్మస్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పండగకు అవసరమైన వస్తుసామగ్రి కొనుగోలు చేసేందుకు పట్టణానికి పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో సందడి వాతావరణం కనిపించింది.

విద్యుత్తు కాంతుల వెలుగులో చర్చిలు

క్రిస్మస్ సందర్భంగా చర్చిలను ఆయా సంఘ కాపరులు విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. విద్యుత్ దీపకాంతులతో ఉన్న చర్చిలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దీనికి తోడు చర్చిలపై ఏర్పాటుచేసిన స్టార్లు, శిలువలు చర్చిలకు కొత్త శోభను తెచ్చిపెట్టాయి. క్రైస్తవులు, విశ్వాసులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో వీధుల్లో ఏర్పాటు చేసిన స్టార్లు ఆకర్షణీయంగా ఉన్నాయి.

సెయింట్ లూథరన్ చర్చి ముస్తాబు

రైల్వేకోడూరు అర్బన్: పట్టణంలోని అతి పురాతన సెయింట్ లూథరన్ చర్చి క్రిస్‌మస్ వేడుకకు ముస్తాబైంది. విద్యుత్తు వెలుగుల్లో చర్చి ప్రాంగణమంతా కళకళలాడుతోంది. నియోజకవర్గంలోని క్రైస్తవులకు మాజీఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు క్రిస్మస్ శుభాకాక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో పండగ జరుపుకోవాలని కోరారు. రెడ్డివారిపల్లిలో ఏర్పాటు చేసిన విందుకు నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రార్థనా మందిరాలకు ప్రత్యేక అలంకరణ

ఓబులవారిపల్లె: క్రిస్మస్ పండగను పురస్కరించుకొని జాతీయ రహదారి పక్కనే ఉన్న మంగంపేట మన్నా చర్చిని విద్యుద్దీపాలతో అలంకరించారు. పాస్టర్ ధర్మాబాస్ మాట్లాడుతూ క్రీస్తు పుట్టినరోజున క్రిస్మస్ పండగ జరుపుకోవడం జరుగుతోందన్నారు. ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

మానవాళికి శాంతినిచ్చేదే క్రిస్మస్



ప్రపంచ శాంతి, సౌభాగ్యాన్ని అనుగ్రహించే రోజు క్రిస్మస్ పర్వదినం. ప్రభువుపై పరిపూర్ణమైన విశ్వాసం, భయభక్తులతో ఆయనకు ఇష్టులుగా జీవించి శాంతి సమాధానాలు పొందడమే నిజమైన క్రిస్మస్ ఆరాధన. క్రిస్మస్ సర్వ మానవాళికి పర్వదినం.

– మార్టిన్ లూథరన్, పాస్టర్ బేతేలు చర్చి, టీ.అగ్రహారం, రాజంపేట

సంతోషాలకు ప్రతీక క్రిస్మస్



రాయచోటి (జగదాంబసెంటర్): క్రీస్తు జననం మానవాళికి శుభకరం. ప్రేమ, శాంతి, సంతోషాలకు ప్రతీక క్రిస్మస్. క్రీస్తు బోధనలను అందరూ ఆచరించాలి. నియోజకవర్గ ప్రజలకు శ్రీకాంత్‌రెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు. ప్రతి ఒక్కరూ ఆనందంగా పండగ జరుపుకోవాలి.

– వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

12వ పీఆర్సీ కమిషన్ నియమించాలని వినతి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి, తదితరులు

రాయచోటి టౌన్: 30 శాతం జీవన భృతి చెల్లించాలని, 12వ పీఆర్‌సీటీ కమీషన్ నియమించాలని పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్‌రెడ్డి కోరారు. పీఎస్‌టీయూ(ప్రగతి శీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం) డైరీని రాష్ట్ర రవాణా, క్రీడల, యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డితో కలిసి పీఎస్‌టీయూ జిల్లా నాయకులు మంగళ వారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం తమ న్యాయమైన కోర్కెలు నెరవేర్చేలనే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రిని వారు కోరారు. జమాల్‌రెడ్డి మాట్లాడుతూ రెండు డీఏ బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పీసీ.రెడ్డెన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ మజహరుల్‌హక్, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓబుళరెడ్డి, జక్రియాబాషా, రాజగోపాల్, ఎస్ఎండీ.గౌస్, షబ్బీర్ అహమ్మద్, హబీబుల్ రహిమాన్, బాలాజీ, నరసింహారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్తు ఛార్జీల పెంపుపై పోరుబాట

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు



పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్: కూటమి ప్రభుత్వం వస్తే విద్యుత్తు భారం తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు అధికారం చేపట్టిన ఏడు నెలల్లోనూ మూడుసార్లు ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈ నెల 27 జరిగే వైఎస్సార్సీపీ పోరుబాట పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు సంపద సృష్టించి ప్రజలకు మేలు చేస్తామని చెప్పిన చంద్రబాబు, పవన్ కూటమి.. ఏడు నెలల్లోనే ప్రజలపై సుమారు రూ.15835 కోట్ల భారం మోపిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కోడూరు మండలం రాఘవరాజపురం కేంద్ర విద్యుత్ కార్యాలయం వద్ద ఈ నెల 27న శుక్రవారం ఉదయం 9:30 గంటలకు పోరుబాట కార్యక్రమం చేపడుతున్నామన్నారు. నియోజక వర్గంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, నందాబాలా, జనార్దన్ రాజు, యనమల మహేష్, బండారు మల్లికార్జున, రఫి, ఫరూక్, శకరయ్య, రాజారెడ్డి, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చౌక దుకాణ డీలర్లకు దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని ఎనిమిది చౌక దుకాణ డీలర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కాలాడివాళ్లపల్లి(ఎస్సీ), పాలెం గొల్లపల్లి(ఓసీ), అనంతపురం ఈడిగపల్లి(ఓసీ మహిళ), ఉత్తమ మేటి హరిజనవాడ(ఎస్సీ), దప్పేపల్లి గ్రామం వల్లూరు వాండ్లపల్లి(ఓసీ), కస్తూరురాజిగారిపల్లి గ్రామం, చాగలగుట్టపల్లి(ఎస్సీ), కస్తూరురాజుగారి పల్లి(ఓసీ మహిళ), లక్కిరెడ్డిపల్లి కొత్తకొట్టాలు(ఎస్సీ) దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుంచి డిసెంబర్ 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జనవరి 7, 2025న రాత పరీక్ష ఉంటుందని, పరీక్షల్లో ఎంపికైన వారికి వ్యక్తిగతంగా తెలియజేస్తారని తెలిపారు. దరఖాస్తు చేయదలచుకున్న అభ్యర్థులు గ్రామ స్థానికులై ఉండాలని, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు.


గాలివీడు మండలంలో..

గాలివీడు : మండలంలోని చౌక దుకాణాల్లో డీలర్లను నియమించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దారు భాగ్యలత తెలిపారు. గాలివీడు పరిధిలోని యూనియన్ బ్యాంకు ఎదురుగాఉన్న చౌకదుకాణం,(ఎస్టీ మహిళ), పెద్దూరు(ఓసీ మహిళ), దానంరెడ్డిగారిపల్లె(ఎస్సీ), రెడ్డివారిపల్లె(ఈడబ్ల్యూఎస్), చావిడిపల్లె(ఎస్టీ), బోడిసానివారిపల్లె(ఓసీ), వెలిగల్లుకస్బా(ఎస్సీ), ఎర్రదొడ్డిపల్లె(బీసీ-ఎ మహిళ), పందికుంట గ్రామం సుగాలి తండా(ఎస్సీ), కొర్లకుంట గ్రామం చావిడి పల్లె(ఓసీ), గుండ్లచెరువుకస్బా(ఓసీ), ఆవులరెడ్డిగారిపల్లె(ఓసీ మహిళ)కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ పాసైన వారు 18–40 సంవత్సరాల వయస్సు గల వారు డిసెంబరు 23వ తేదీ నుంచి డిసెంబరు 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

రామాపురం మండలంలో..

రామాపురం: మండలంలోని 13 గ్రామ పంచాయితీల పరిధిలో చౌకదుకాణాల డీలర్ల నియామకాలకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు రామాంజనేయులు కోరారు. గువ్వలచెరువు హరిజనవాడ ఓసీ(పీడబ్ల్యూ బిడి) సుగాలి బడికి (బీసీడి), కసిరెడ్డిగారి పల్లె(ఓసీ మహిళ), ఓబుల్‌రెడ్డిగారిపల్లె (బీసీ-డి), బయారెడ్డిగారిపల్లె (బీసీ-బి), దూదేకులపల్లె (ఎస్సీ), నల్లగుట్టపల్లె (బీసీ-బి మహిళ), సరస్వతి పల్లె (ఓసీ), కొమ్మూరువాండ్లపల్లె(ఓసీమహిళ), కొలిమివాండ్లపల్లె(ఎస్సీమహిళ), పాలిమేరపల్లె (ఓసీ), రాచపల్లి (బిసి-ఎ మహిళ), గంగనేరు (ఓసీ), గొల్లపల్లె (ఓసి) పిడబ్ల్యూపీడీ) హసనాపురం 1 (ఎస్సీ), హసనాపురం 2(ఎస్టీమహిళ) , చెరువుముందరపల్లి(ఓసీ), ఎర్రంగివాండ్లపల్లె (బీసీ-బి మహిళ), ఏకిలపల్లె(ఓసీ), కొండారెడ్డిగారిపల్లె(ఓసీ), సూరకవాండ్లపల్లె (బీసీ-బి మహిళ), రాఘవరెడ్డిగారిపల్లె (ఓసీమహిళ) , బండపల్లి (బీసీ-డి మహిళ), బి.రాచపల్లె (బీసీ-ఈ మహిళ)కు కేటాయించారని తెలిపారు. దరఖాస్తుదారుల వయస్సు 18 నుండి 40 సంవత్సరాలు మధ్య ఉండాలని, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించి ఉండాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కళాశాల గుర్తింపు రద్దు చేయాలని నిరసన



నిరసన ప్రదర్శన చేపడుతున్న నాయకులు

రాయచోటి అర్బన్: స్టడీ అవర్‌కు రాలేదనే కారణంతో బ్లేడ్‌తో కోసి విద్యార్థిని గాయపరచిన సాయి జూనియర్ కళాశాల గుర్తింపును రద్దుచేయాలని విద్యార్థి సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థిపై కళాశాల టీచర్ దాడికి పాల్పడడాన్ని నిరసిస్తూ మంగళవారం కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం అనుమతులు లేకుండానే రెసిడెన్షియల్ హాస్టల్ నడుపుతోందని ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నా ఇంటర్మీడియట్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం దారుణమన్నారు. బ్లేడ్‌తో దాడి ఘటనపై విచారించి నిజానిజాలు తేల్చేందుకు అధికారులు కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరసింహ, మాధవ్, నేతినాగేశ్వరి, సాయికుమార్, రమణ, మదన్‌మోహన్‌రెడ్డి, గురునాథ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగించండి



మాట్లాడుతున్న డీపీఓ బాలకృష్ణారెడ్డి

వీరబల్లి: కేంద్రంలో పిచ్చి మొక్కలను తొలగించాలని జిల్లా పంచాయతీశాఖ అధికారి బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మట్లి పంచాయతీ ఎల్లంపల్లి వద్ద ఏర్పాటుచేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. బల్సానివాళ్లపల్లి హరిజనవాడలో నీటి సౌకర్యం గురించి ఆరా తీశారు. పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రబీ సాగుపై అవగాహన



నారును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సిద్దవటం: రబీ సాగుపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. మండలంలోని మాచుపల్లెలో మంగళ వారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. నాగరాజ మాట్లాడుతూ రబీలో రైతులు వరి, నువ్వులు, కూరగాయలు వేరుశనగ పంటలను సాగుచేస్తున్నారన్నారు. వరిలో కాలి బాటలు, నారు నాటేటప్పుడు కొనలు తుంచినాటడం, జిగురు పూసిన పసుపు, తెలుపు, నీలం పల్లాలు, లింగాకర్ష బుట్టలు అమర్చడం గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, లక్ష్మీదేవి, చిన్నక్క, బాగ్యలక్ష్మి, లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించండి

సుండుపల్లె: చిన్నగొల్లపల్లి పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానని వైఎస్సార్‌సీపీ సర్పంచ్ రామాజయచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బొల్లువాండ్లపల్లి, అన్నంవాండ్లపల్లి, చిన్నగొల్లపల్లిలో తాగునీటి మోటార్లు మరమ్మతులకు గురవడంతో సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి టెక్స్‌మో కంపెనీకి చెందిన 7.5 కొత్త మోటార్లు అమర్చినట్లు తెలిపారు.

హనుమకు విశేష పూజలు

రామాపురం: మండలంలోని రాచపల్లె పంచాయతీ కొమ్మూరివాండ్లపల్లె ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన చలమారెడ్డి, రామోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి కుటుంబీకులు ఈ పూజలలో భాగంగా స్వామికి పంచామృత అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ప్రపంచ రచయితల మహాసభలకు ఆహ్వానం

నందలూరు: విజయవాడలో ఈ నెల 28, 29వ తేదీలలో జరగబోయే ఆరో ప్రపంచ రచయితల మహాసభలలో పాల్గొనాలని నందలూరుకు చెందిన ప్రముఖ రచయిత్రి, నాట్య కళాకారిణి డాక్టర్ కోడూరు సుమనశ్రీకి ఆహ్వానం అందింది. ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, కార్యదర్శి జివి పూర్ణచందు తనకు ఆహ్వానం పంపినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు బాషా సంఘం ప్రముఖులు ఎన్ఆర్‌కె.రాజు, మాజీ ఏజీపీ షేక్‌మహ్మద్, సాహిత్య, సాంస్కృతిక రంగ ప్రముఖులు ఆమెను అభినందించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

లక్కిరెడ్డిపల్లి: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ పద్మావతమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. లక్కిరెడ్డిపల్లి మండలం అనంతపురం ఈడిగపల్లిలో అంగన్‌వాడీ సహాయకురాలు (ఓసీ), రామాపురం మండలం బాలిరెడ్డిపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ), ఏకిలపల్లిలో అంగన్‌వాడీ సహాయకురాలు(బీసి), గాలివీడు మండలం కరీంరెడ్డిగారిపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ), పెడబల్లిలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ), పక్కిరరెడ్డిగారిపల్లిలో సహాయకురాలు(ఓసీ), ఆరివీడు గాండ్లపల్లిలో సహాయకుల(ఓసీ) ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ నుంచి జనవరి 2వ తేదీలోపు తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆమె తెలిపారు.

గాలివీడు మండలంలో..

గాలివీడు: మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, అంగన్వాడీ సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు లక్కిరెడ్డి పల్లె సీడీపీఓ వై.పద్మావతి తెలిపారు. పక్కీరారెడ్డిగారిపల్లెలో అంగన్వాడీ సహాయకురాలు(ఓసీ), గోరాన్ చెరువు గ్రామం కరిమిరెడ్డిగారిపల్లె అంగన్వాడీ కార్యకర్త(ఓసీ), అరవీడుకస్బాలో అంగన్వాడీ సహాయకురాలు(ఓసీ), గాండ్లపల్లె అంగన్వాడీ సహాయకురాలు(ఓసీ) పెద్దపల్లె మినీ అంగన్వాడీ కార్యకర్త(ఓసీ) స్థానాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రాజంపేట రూరల్ మండలంలో..

రాజంపేట రూరల్: ప్రాజెక్టు పరిధిలోని అంగనవాడీ కేంద్రాలలో కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వై.సుజాత తెలిపారు. రాజంపేట మండలం చింతలకోనలో మినీ అంగనవాడీ కార్యకర్త(వీహెచ్-06), నందలూరు మండలంలోని ఓల్డ్‌ఆర్ అండ్‌బీ వద్ద నున్న అంగనవాడీలో మినీ అంగనవాడీ కార్యకర్త (బీసీ-ఏ(29)తోపాటు రాజంపేట మండలం వెంకటరాజంపేట(ఓహెచ్-56), శేషమాంబపురం(హెచ్‌హెచ్-31), జానీబాషాపురం(బీసీఈ(69)), రామ్‌నగర్ ఎస్టీ కాలనీ (ఎస్టీ(75))లలో సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. మౌఖిక పరీక్షల ద్వారా ఎంపిక చేస్తామని ఆమె తెలిపారు.

ధనికుల భవంతులు కనిపించడం లేదా?



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

గాలివీడు: ఆర్‌అండ్‌బీ స్థలంలో నిరుపేదల నివాసాలు, రేకుల షెడ్లు తొలగించిన అధికారులకు అక్కడి ధనవంతుల భవంతులు కనిపించడం లేదా అంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో నివాసాలు కోల్పోయిన బాధితులు మంగళవారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమంగా నివాసమున్నారంటూ రెవెన్యూ అధికారులు తమ నివాసాలను నేలమట్టం చేశారని, అదే స్థలంలో ధనవంతుల భవంతుల జోలికి వెళ్లడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకో న్యాయం.. పెత్తం దారులకు మరో న్యాయమా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ధనవంతులు ఇచ్చే మామూళ్లకు అమ్ముడుపోయి ఇలా ఏకపక్షంగా నిరుపేదల కడుపు కొడుతున్నారని వారు ఆరోపించారు. కలెక్టర్ విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి

పౌర హక్కుల సంఘం నేతల డిమాండ్



బాధితుడితో మాట్లాడుతున్న నాయకులు

రాయచోటి అర్బన్: రాయచోటి రూరల్ మండలం కాటిమాయకుంట కాల్పుల కేసులో నిందితులపై హత్య కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి రవిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలేకరులతో వారు మాట్లాడుతూ కాటిమాయకుంట వద్ద జరిగిన కాల్పుల ఘటనపై మంగళవారం బాధితుడి భార్య, బంధువులతోపాటు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రమణ నుంచి వివరాలు సేకరించామని తెలిపారు. సంబేపల్లె మండలం నామాలగుట్టకు చెందిన పేదలైన హనుమంతు, రమణల కుటుంబీకులు మేకలు మేపుతూ, చుట్టుపక్కల గ్రామాల్లో యాచిస్తూ జీవిస్తున్నారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున పల్లెలకు వెళ్తుండగా పక్కనే గుట్టలో నుంచి కాల్పులు జరపడంతో గాయపడ్డారన్నారు. గాయపడిన హనుమంతు మృతి చెందగా, రమణ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. కాల్పులు జరిపింది ఎవరనేది తెలియడంలేదన్నారు. పోలీసులు విచారణ జరిపి కాల్పులు జరిపిన వారిపై హత్యా నేరం కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతుడు హనుమంతు కుటుంబానికి రూ.25 లక్షలు, గాయప డిన రమణ కుటుంబానికి రూ.15 లక్షలు నష్టపరిహారంగా చెల్లించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలంటూ పోలీసు ఉన్నతాధికారులను వారు కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు శ్రీనివాసులు, నాగార్జున పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా కోరుతూ నిరసన



మాట్లాడుతున్న గౌతమ్‌కుమార్

రాయచోటి అర్బన్: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖా మంత్రి పదవికి అమిత్‌షా రాజీనామా చేయాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ పట్టణంలోని జాతీయ రహదారిపై మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌పై వ్యాఖ్యలను రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఖండించకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు యుగంధర్, ఆంజనేయులు, బాలాజీ, శ్రీనాథ్, గంగాధర్, మహేష్, మల్లికార్జున, నాగేశ్వరరావు, రవిశంకర్, నాగేశ్వర, రెడ్డెయ్య, రమణ, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



రెవెన్యూ సదస్సులో ఆర్డీఓ శ్రీనివాస్

రామాపురం: భూ సమస్యలను పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశమని ఆర్డీఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కల్పనాయినిచెరువు సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. ఇతహసీల్దారు రామాంజనేయులు, నోడల్ అధికారి మణిపాల్గొన్నారు.

సుండుపల్లె గ్రామంలో

సుండుపల్లె: సుండుపల్లె-3 సచివాలయంలో మండల ప్రత్యేక నోడల్ అధికారి జయరాముడు రెవెన్యూ సదస్సు మంగళవారం నిర్వహించారు. తహసీల్దారు దైవాధీనం మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

పుల్లంపేట: మండలంధిలోని గారాలమడుగులో మంగళవారం తహసీల్దార్ అరవింద కిషోర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో రెవెన్యూకు 4, ఇతరులకు సంబంధించి 2 అర్జీలు అందినట్లు తహసీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీరాములు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దవటం: రైతుల సమస్యలను పరిష్కరిస్తామని ఇన్‌ఛార్జి తహసీల్దారు మాధవీలత తెలిపారు. సిద్ధవటం సచివాలయం ఆవరణలో మంగళవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి తహసీల్దారు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ఫిర్యాదు చేసిన ప్రతి రైతు సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సుదర్శన్, కేశవులు, జవహర్‌బాషా, ఓబులయ్య, రైతులు పాల్గొన్నారు.

వీరబల్లి: మండలంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు శ్రావణి తెలిపారు. మట్లి పంచాయతీలో మంగళవారం రెవెన్యూ సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులకు సమస్యలుంటే రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేయాలని తెలిపారు. . రికార్డులను పరిశీలించిన తరువాత పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సర్పంచ్ నాగార్జున ఆచారిపాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టేందుకు కమిటీలు వేశాం



మాట్లాడుతున్న సీడీపీఓ నిర్మల జ్యోతి

పెనగలూరు: బాల్య వివాహాలను అరికట్టాలని సీడీపీఓ నిర్మల జ్యోతి కోరారు. ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మంగళవారం కిశోర వికాసం శిక్షణ నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు చేయడంతో వారి ఆరోగ్యం పాడవుతుందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలపై ఇప్పటికే కమిటీలు వేశామని, ఆ కమిటీ సభ్యులు ఆయా గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటుచేసి బాల్య వివాహాలపై ఆరా తీయాలన్నారు. అలాగే పలు అంశాలపై ఏబీఎస్ నిరంజన్ వివరించారు. ఈ కార్యక్రమంలో విజయకుమారి, విశాలాక్షి, లక్ష్మీనరసమ్మ, నిరంజన్, పద్మభూషణ్‌రెడ్డిపాల్గొన్నారు.

రామాపురం: కిశోరి బాలికలకు అన్ని విషయాలపై సంపూర్ణమైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని లక్కిరెడ్డిపల్లె సీడీపీఓ పద్మజ అన్నారు. స్థానిక ఎంపీడీఓ సభ భవనంలో కిశోరి వికాసంపై మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్మజ మాట్లాడుతూ 11–18 సంవత్సరాల బాలికలకు వారి శరీరంలో వచ్చే మార్పులకు అనుగుణంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపై వివరించారు. బాల్య వివాహాలు చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సుజాతరెడ్డి, పద్మజ, రాణి, హుస్సేనమ్మ పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి: విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని హెల్త్ సూపర్‌వైజర్ మణి పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు పీరియడ్స్ సమయంలో జాగ్రత్తగా స్నానాలాచరించి హారిక సూత్రాలు పాటించాలన్నారు.